సాక్షి ప్రకాశం

సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



ప్రతిపక్షాలవి పగటి కలలు

ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. - 8లో..



భారీగా అక్రమ మద్యం పట్టివేత

హర్యానా, గోవా రాష్ట్రాల నుంచి అక్రమంగా తీసుకొచ్చిన మద్యాన్ని దర్శి ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 648 ఫుల్ బాటిళ్లు పట్టుకున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33 /25

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సా॥ 06:29 ని॥
సోమవారం

సహర్ : ఉ॥ 04:37 ని॥
మంగళవారం

న్యూస్‌రీల్

పలువురు ఎస్ఐల బదిలీ

ఒంగోలు టౌన్: జిల్లాలోని ఏడుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ మలికా గర్గ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉండి ఒంగోలు వన్‌టౌన్‌కు అటాచ్ చేసిన బి.సాంబశివరావును కొత్తపట్నం ఎస్ఐగా బదిలీ చేశారు. కొత్తపట్నంలో విధులు నిర్వహిస్తున్న కే.మధుసూదనరావును జిల్లా వీఆర్‌కు పంపారు. సంతనూతలపాడు ఎస్ఐ బి.శ్రీకాంత్‌ను మద్దిపాడుకు బదిలీ చేసి అక్కడ ఉన్న టి.శ్రీరామ్‌ను వీఆర్‌కు పంపించారు. జిల్లా వీఆర్‌లో ఉన్న వి.ఆంజనేయులును సంతనూతలపాడుకు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉండి ఒంగోలు వన్‌టౌన్‌కు అటాచ్ చేసిన వై.శ్రీహరిని పుల్లలచెరువుకు బదిలీ చేశారు. ఒంగోలు డీఎస్పీ లో విధులు నిర్వహిస్తూ దిశ పోలీసు స్టేషన్‌కు అటాచ్‌లో ఉన్న షేక్.నజీర్ బాషాను ఒంగోలు దిశ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు.

16న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

అర్ధవీడు (కంభం): పట్టాభిరామ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో ఈనెల 16వ తేదీ రాష్ట్ర స్థాయి పెద్దసైజు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతుల కింద రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాల్గొనదలచిన వారు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ 9866651098, 9701116102 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మహనీయుల బాటలో నడుద్దాం

● ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి



మహనీయుల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు టౌన్: సమాజంలో మార్పు కోసం, సమసమాజ నిర్మాణం కోసం అహర్నిశలు పాటుపడిన బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతీరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ అడుగుజాడల్లో పయనిద్దామని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి అన్నారు. మహనీయుల జయంతులను పురస్కరించుకొని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో శనివారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చలనచిత్రాన్ని ప్రదర్శించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ చిత్రాన్ని వీక్షించారు. ముఖ్య అతిథిగా హాజరైన పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ దళిత మహిళలకు చదువు చెప్పేందుకు ఎన్నో అవమానాలు, దాడులను భరించిన జ్యోతిరావు దంపతుల త్యాగాన్ని ఎన్నటికీ మరిచిపోలేమని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత పాడిబండ్ల ఆనందరావు, డాక్టర్ చిడితోటి జీవన్, జాలాది మణిబాబు, చాపల వంశీకృష్ణ, జ్వాలాకోటి, గోలి తిరుపతిరావు, కనకమాల రాఘవులు తదితరులు ప్రసంగించారు. సభకు అంగలకుర్తి ప్రసాద్ అధ్యక్షత వహించగా గేరా అజయ్ బాబు, వేలూరు శ్రీనివాసరావులు కార్య నిర్వాహకులుగా వ్యవహరించారు. 'దేవుడు కనిపించాడు', 'మీరైతే ఏం చేస్తారు' నాటికలను ప్రదర్శించారు. ధేనువకొండ సుబ్బయ్య, వాకా సంజీవ రెడ్డి, దిగ్విజయ్, ఎంవీపీ బాబురావు, గుండె భూషణం, అంగలకుర్తి ప్రసాద్ తదితరులు నటించారు.

జేసీఐ ఎస్ఎంఎస్ చైర్మన్‌గా రవీంద్ర

ఒంగోలు టౌన్: జేసీఐ ఎస్ఎంఎస్ నూతన చైర్మన్‌గా కేకే కంప్యూటర్స్ రవీంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. స్థానిక మినీ స్టేడియంలో వాకర్స్, క్రీడాకారులు కూర్చోడానికి బల్లలు ఏర్పాటు చేయాలని సభ్యులు తీర్మానం చేశారు. భవిష్యత్తులో మెడికల్ క్యాంపులు, ట్రైనింగ్ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు చైర్మన్ రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు.

పశ్చిమాన అభివృద్ధి వెలుగులు

జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రాంత అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వందల కోట్లు ఖర్చుపెట్టి అభివృద్ధి పనులు చేపట్టారు. సాగు, తాగునీటి వసతి కల్పించడంతో పాటు మెరుగైన విద్య, వైద్యం పేదలకు అందేలా మెడికల్ కాలేజీ, గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలు నిర్మిస్తున్నారు. పశ్చిమ ప్రాంత జీవనాడి వెలిగొండను వడివడిగా పూర్తిచేస్తున్నారు.

- పశ్చిమ ప్రకాశం అభివృద్ధిపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి
- మార్కాపురంలో మెడికల్ కాలేజీ
- పెద్ద దోర్నాలలో గిరిజన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
- పొదిలిలో పెద్ద చెరువుకు రూ.50 కోట్లు మంజూరు
- మార్కాపురంలో నీటి ఎద్దడి నివారణకు రూ.25 కోట్లు మంజూరు
- సీఎంగా మార్కాపురానికి మొదటిసారి ఈనెల 12న రాక



మార్కాపురం వ్యూ

మార్కాపురం:

అభివృద్ధిలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి..నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిది ఒకే బాట. పశ్చిమ ప్రకాశాన్ని అభివృద్ధి పథాన నిలపడంలో వారిద్దరూ తమదైన ముద్ర వేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం కాగానే మూడు జిల్లాల్లో శాశ్వతంగా కరువు నివారించే వెలిగొండ ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. రాజీవ్ పల్లెబాట, నగర బాటలో మార్కాపురానికి వచ్చి దూపాడు నుంచి కృష్ణా జలాలు మార్కాపురానికి అందించడంతో పాటు రాయవరం రైల్వే స్టేషన్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిని కూడా మంజూరు చేశారు. ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా పోలవరంతో సమానంగా వెలిగొండ ప్రాజెక్టు పనులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించడంతో వడివడిగా పనులు సాగుతున్నాయి.

మార్కాపురంపై ప్రత్యేక దృష్టి:

డివిజన్ కేంద్రమైన మార్కాపురం నియోజకవర్గంలో అన్ని విభాగాల్లో కలిపి దాదాపు రూ.800 కోట్లకు పైగా నిధులు కేటాయించడంతో అభివృద్ధి పనులు వివిధ దశల్లో సాగుతున్నాయి. ముఖ్యంగా మార్కాపురంలో రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీ పనులు సాగుతున్నాయి. జిల్లా వైద్యశాలలో సుమారు రూ.5 కోట్లకు పైగా నిధులు కేటాయించడంతో వైద్యశాలలో అన్ని సౌకర్యాలు సమకూరాయి. పశ్చిమ ప్రకాశంలోని మూడు నియోజకవర్గాల్లో శాశ్వతంగా కరువు నివారించేందుకు గొట్టిపడియ దగ్గర రూ.1230 కోట్లతో ఇన్‌టేక్‌వెల్ ట్యాంక్ మంజూరు చేశారు. ఇక్కడి నుంచి వెలిగొండ నీటిని 3 నియోజకవర్గాల్లోని ప్రజలకు అందిస్తారు. ఇక పొదిలిలో సాగర్ నీటిని ప్రజలకు అందించేందుకు పెద్ద చెరువు కోసం రూ.55 కోట్లు కేటాయించారు. మార్కాపురం పట్టణంలో శాశ్వతంగా తాగునీటి సమస్య నివారణకు రూ.25 కోట్లు కేటాయించారు. వీటితో పాటు షాదీఖానా, మార్కాపురం టౌన్, తర్లుపాడు, కేకేమిట్ల, పొదిలిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మించారు. రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు వివిధ దశల్లో ఉన్నాయి.

వైపాలెం అంటే అభిమానం:

యర్రగొండపాలెం నియోజకవర్గంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక అభిమానం. ఎక్కువగా గిరిజనులు ఉండడంతో నియోజకవర్గంలోని పెద్ద దోర్నాలలో రూ.50 కోట్లతో గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను మంజూరు చేశారు. నియోజకవర్గంలోని పుల్లలచెరువులో శాశ్వతంగా తాగునీటి సమస్యను నివారించేందుకు వెలిగొండ ప్రాజెక్టు కాలువ ఎక్స్‌టెన్షన్, టీ5కు రూ.82 కోట్లు కేటాయించారు. దీంతో పాటు గిద్దలూరు నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ వ్యవసాయ ల్యాబ్‌ను మంజూరు చేయడంతో నగర పంచాయతీలో తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు నిధులు కేటాయించారు.



నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ



దోర్నాలలో నిర్మాణంలో ఉన్న గిరిజన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

మొదటిసారి రాక..

సీఎంగా మొదటిసారి ఈ నెల 12న ఈబీసీ నేస్తం ప్రారంభించేందుకు మార్కాపురానికి వస్తున్నారు. దీంతో మార్కాపురం ప్రాంత ప్రజలు సీఎం పర్యటనపై ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. విశేషమేమిటంటే నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మార్కాపురం ఎమ్మెల్యేగా కేపీ కొండారెడ్డి ఉండగా.. నేడు వైఎస్ జగన్ హయాంలో కేపీ తనయుడు నాగార్జునరెడ్డి ఎమ్మెల్యేగా ఉండటం విశేషం.

సీఎం ప్రత్యేక దృష్టి

మార్కాపురం నియోజకవర్గం అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు చేపట్టడంతో పాటు మార్కాపురానికి మెడికల్ కాలేజిని మంజూరు చేయడం, పొదిలి పెద్ద చెరువుకు రూ.50 కోట్లు, మార్కాపురానికి రూ.25 కోట్లు కేటాయించారు. అభిమానం ఉండబట్టే సీఎం జగన్ నిధులు మంజూరు చేస్తున్నారు. మార్కాపురం నియోజకవర్గం తరఫున ధన్యవాదాలు.

– ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

సీఎం పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఇస్మాయిల్, పార్టీ నాయకులు

మార్కాపురం: ఈ నెల 12న మార్కాపురం వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. సభా ప్రాంగణాన్ని ఎస్వీకేపీ డిగ్రీ కళాశాలలో, హెలీప్యాడ్‌ను జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 40 నుంచి 50 వేల మంది వరకు కూర్చున్నే వసతిని ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మెన్ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. ప్రత్యేక గ్యాలరీలు, ఏర్పాటు చేయడంతో పాటు వేసవి దృష్ట్యా ఎండ వేడిని కూడా ఆయా ప్రాంతాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని చోట్ల వాటర్ పాయింట్లు కూడా అమరుస్తున్నారు. ఎక్కడికక్కడ మంచి నీళ్లు, మజ్జిగ అందించేందుకు గ్యాలరీలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, వైస్ చైర్మెన్ అంజమ్మ శ్రీనివాసులు, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఉస్మాన్, కేతగుడిపి సర్పంచ్ మస్తాన్, ఇండ్ల రవికుమార్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి



కేపీ నాగార్జునరెడ్డి



జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: ఈ నెల 12న ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మార్కాపురంలోని ఎస్వీకేపీ కళాశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఎస్వీ సత్యనారాయణకు హనుమారెడ్డి పురస్కారం



ప్రసంగ సమావేశంలో మాట్లాడుతున్న పాన్నూరు

ఒంగోలు టౌన్: భీమనాథం హనుమారెడ్డి స్మారక సాహిత్య పురస్కారం–2023ను ప్రముఖ అభ్యుదయ కవి, సాహితీ విమర్శకుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ఎస్వీ సత్యనారాయణను ఎంపిక చేసినట్లు ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పాన్నూరు శ్రీనివాసులు తెలిపారు. ఈ అవార్డు కింద రూ.10 వేల నగదు, ప్రత్యేక జ్ఞాపిక, శాలువతో సత్కరించనున్నట్లు ప్రకటించారు. స్థానిక రాజాపానగల్ రోడ్డులో ఆదివారం ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో హనుమారెడ్డి జయంతి వేడుకల సన్నాహక సభ నిర్వహించారు. ప్రముఖ కవి డా.యు.దేవపాలన, వీవీ శేషయ్య, కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బీనీడి కృష్ణయ్య, పిన్ని వెంకటేశ్వర్లు, అన్ను విజయకుమారిలకు హనుమారెడ్డి స్మారక ఆత్మీయ సాహిత్య పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 23వ తేదీ ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించే హనుమారెడ్డి 82వ జయంతి వేడుకల్లో ఈ పురస్కారాలను అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యత్తపు కొండారెడ్డి, జి.దివాకర్ దత్తు, సయ్యద్ ఇస్మాయిల్, కేఎస్వీ ప్రసాద్, పాలూరి శివప్రసాద్, వీవీ శేషయ్య, ఆవుల వెంకటరమణ, అన్ను విజయకుమారి, జి.నరసింహారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు



రాష్ట్ర స్థాయి ఎడ్లపందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

● సత్తా చాటిన వైఎస్సార్ జిల్లా ఎడ్ల జతలు

రాచర్ల: రాచర్ల మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి బండలాగుడు పందేలు ఏర్పాటు చేశారు. ఈ ఎడ్ల పందేల్లో ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పాల్గొని బండ పందేలు ప్రారంభించారు. పందేలకు మొత్తం 11 జతలు పాల్గొనగా వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలం ఆనంవారిపల్లి గ్రామానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లజతలు నిర్ణీత 15 నిమిషాల్లో 1200 అడుగులు లాగి మొదటి స్థానాన్ని కై వసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం పీ.ఆర్ పల్లె గ్రామానికి చెందిన షేక్.జాఫర్‌సాహెబ్ ఎడ్ల జతలు 938 అడుగులు లాగి రెండో బహుమతి సాధించగా, ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన లక్కు నాగశివకుమార్ ఎడ్ల జతలు 900 అడుగులు లాగి మూడో బహుమతి గెలుచుకున్నాయి. వైఎస్సార్ జిల్లా కలసపాడు మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన బి.జయన్న ఎడ్లజతలు 835 అడుగులు లాగి నాల్గవ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం సత్యవోలు గ్రామానికి చెందిన బత్తుల బాలరాజు ఎడ్లజతలు 796 అడుగులు లాగి ఐదో బహుమతి సాధించగా, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామి చౌదరి ఎడ్లజతలు 755 అడుగులు లాగి ఆరో బహుమతి సాధించాయి. ఈ ఎడ్ల పందేల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.70,116 ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, రెండో బహుమతి రూ.50 వేలు నల్లబోతుల రంగస్వామి, మూడో బహుమతి రూ.40 వేలు బత్తిని క్రిష్టయ్య, పగిడి రామయ్య, నాల్గవ బహుమతి రూ.30 వేలు పగిడి చిన్న పోలిరెడ్డి, ఐదో బహుమతి రూ.20 వేలు బోరెడ్డి చిన్న పుల్లారెడ్డి, చిన్న సుబ్బారెడ్డి, ఆరో బహుమతి రూ.10,116 బొర్రా సుబ్బారావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కన్నసాని చిన్న ఓబులేసు, చినగానిపల్లె సర్పంచ్ పగడాల రమేష్, నిర్వాహకులు డొక్కుపల్లె సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ఒంగోలులో శిలువ ఊరేగింపు



ఒంగోలులో జేఎంబీ చర్చి వద్ద బాణసంచా సందడి



ఒంగోలులో కొండపై ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

లోక రక్షకుని పునరుత్థానం

లోక రక్షకుడైన ఏసుక్రీస్తు సమాధి నుంచి పునరుత్థానం చెందిన పవిత్రమైన ఈస్టర్ పర్వదినాన్ని జిల్లాలో క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రత్యేక వాహనాలపై శిలువను అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

- ఒంగోలు టౌన్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి



మృతిచెందిన సుబ్బరాయుడు

బేస్తవారిపేట: మండలంలోని పీవీ పురం సమీపంలో ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టడంతో కూలీ మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బేస్తవారిపేట మండలంలోని శింగసాని పల్లె నుంచి ఆర్.కొత్తపల్లెకు మిరపకాయల కోత కోసం కూలీలు ఆటోలో బయలుదేరారు. అదే సమయంలో అక్కపల్లె నుంచి కోనపల్లె వైపునకు వెళ్తున్న ట్రాక్టర్.. ఎదురుగా వచ్చిన ఆటోను ఒకవైపు ఢీకొట్టింది. ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న పుల్లా సుబ్బరాయుడు (50)కు కాళ్లు విరిగిపోయాయి. మెడ వద్ద కూడా తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అదృష్టవశాత్తూ ఆటో బోల్తా పడకపోవడంతో మిగిలిన కూలీలకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. మృతుడికి భార్య రత్నమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని మరణంతో వారంతా భోరున విలపిస్తున్నారు. ఎస్సై మాధవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తుతెలియని మృతదేహం

మార్కాపురం: మండల పరిధిలోని రాయవరం రైల్వేస్టేషన్ గేటు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి 55 ఏళ్లు ఉంటాయని, బులుగురంగ పంచ, గులాబీ రంగు చొక్కా ధరించి ఉన్నాడని రూరల్ ఎస్సై సుమన్ తెలిపారు. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

బైకు నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతి చెందిన వరప్రసాదరావు

ఉలవపాడు: బైకు నుంచి జారిపడి ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని ఆత్మకూరు వద్ద ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఆత్మకూరు గ్రామానికి చెందిన తల్లపనేని వరప్రసాదరావు (62) ఉలవపాడుకు ద్విచక్రవాహనం పై వస్తున్న సమయంలో గ్రామం బయటకు రాగానే కిందపడిపోయాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల మార్కెట్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు

- రాష్ట్ర ప్రభుత్వ సహకార, మార్కెటింగ్ సలహాదారు బ్రహ్మానందరెడ్డి



మాట్లాడుతున్న బ్రహ్మానందరెడ్డి

మార్టూరు: మార్టూరు కూరగాయల మార్కెట్ అభివృద్ధి కోసం రూ.64 లక్షల నిధులు మంజూరైనట్లు మార్కెటింగ్ అండ్ కో ఆపరేటివ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లి నుంచి ఒంగోలు వెళ్తూ ఆదివారం ఆయన మార్టూరులో విలేకరులతో మాట్లాడారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మార్కెట్‌లో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు కోసం రూ.22 లక్షలు మంజూరు అయినట్లు, ఈ నెల 12వ తేదీలోపు టెండర్ల దాఖలుకు అధికారులు ఆన్‌లైన్ దరఖాస్తుకు నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. మార్కెట్ దక్షిణం వైపున గల నూతన గోడౌను ప్రాంగణంలో గోడ నిర్మాణం ఇతర అభివృద్ధి పనులతో పాటు 212 మంది హమాలీలకు యూనిఫాం, లైసెన్స్‌లు పంపిణీ కోసం రూ.42 లక్షలు నిధులు మంజూరు అయినట్లు బత్తుల తెలిపారు. రైతులు కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారులు, హమాలీల సంక్షేమ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు.

ప్రతిపక్షాలవి పగటి కలలు

- వారు ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం
- అందుకే జగనన్నను దీవించాలి
- మళ్లీ సీఎంను చేసేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి
- గుంటి గంగ తిరునాళ్లలో విద్యుత్ ప్రభలపై జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రభల నిర్వాహకులు

తాళ్లూరు: ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నుతున్నా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నకు ప్రజలంతా చల్లటి దీవెనలు అందించాలని కోరారు. తాళ్లూరు మండలంలోని తూర్పుగంగవరంలో జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారి తిరునాళ్లలో వైఎస్సార్ సీపీ, బూచేపల్లి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివరామపురం, తూర్పు గంగవరం, నాగంబొట్లపాలెం విద్యుత్ ప్రభలపై శనివారం రాత్రి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. నిత్యం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేసుకుంటూపోతున్నాయన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా రాబోయే 2024 ఎన్నికల్లో ప్రజలంతా సీఎం వైఎస్ జగనన్నకు మళ్లీ పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి లబ్ధిదారుడు సీఎం వైఎస్ జగన్‌ను స్మరించుకుంటున్నారని తెలిపారు. పార్టీ అభ్యున్నతికి తమ కుటుంబం ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని చెప్పారు. అనంతరం బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిని ప్రభల నిర్వాహకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ మెంబర్ షేక్ ఆదాం షరీఫ్, మాజీ ఎంపీపీలు కోట రామిరెడ్డి, పోశం మధుసూదనరెడ్డి, గోళ్లపాటి మోషే, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, కోట వెంకట రామిరెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు గుజ్జుల యోగిరెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, కుమ్మిత శ్రీనివాసరెడ్డి, దారం వెంకటేశ్వరరెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి జక్కుల రామక్రిష్ణ, ఎంపీటీసీ యామర్తి ప్రభుదాస్, సొసైటీ మాజీ చైర్మన్ నాగిరెడ్డి, శివరామపురం సర్పంచి బొడ్డు రాములు, ఆలోకం హరిబాబు, మన్నం వేణు, కాశిరెడ్డి, వీరాంజిరెడ్డి, అనపర్తి కృపయ్య పాల్గొన్నారు.

రూ.2 లక్షల కోట్లు ప్రజలకు అందించడం చారిత్రాత్మకం

- సీఎం వైఎస్ జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుకుందాం
- 2024లో మళ్లీ సీఎంను చేసుకుందాం
- దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్



ఎమ్మెల్యే మద్దిశెట్టిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లూరు: రాష్ట్రంలో పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల ద్వారా నాలుగు సంవత్సరాలలో నేరుగా రెండు లక్షల కోట్ల రూపాయలు అందించడం చారిత్రాత్మకమని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ పేర్కొన్నారు. గుంటి గంగా భవాని అమ్మవారి తిరునాళ్లలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివరామపురం, కొత్తపాలెం, రమణాలవారిపాలెం, మాధవరం గ్రామాల విద్యుత్ ప్రభలపై శనివారం రాత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. ప్రజల ఇబ్బందులు తీర్చడానికి వారి బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసి ఆదుకుంటున్న ఏకైక సీఎం జగనన్న అని, ఆయనకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలని చెప్పారు. 2019 ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో తమను ఆదరించారని, 2024లోనూ గెలిపిస్తే ఇదేవిధంగా సేవ చేస్తామని చెప్పారు. తాను అనేక సవాళ్లు ఎదుర్కొంటూ నిత్యం ప్రజల మధ్యనే ఉండి సేవ చేస్తున్నానని తెలిపారు. ప్రతిపక్షాల నుంచి ఎన్ని సవాళ్లు ఎదురైనా ప్రజా సేవలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌ను నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తాళ్లూరు, దర్శి ఎంపీపీలు తాటికొండ శ్రీనివాసరావు, గోళ్లపాటి సుధా అచ్చయ్య, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు ఐ.వెంకటేశ్వరరెడ్డి, ఎం.ఎన్.పి.నాగార్జునరెడ్డి, తాళ్లూరు, దర్శి జేసీఎస్ కన్వీనర్లు యాడిక శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, శివరామపురం మాజీ సర్పంచి నిశంకం వెంకటేశ్వర్లు, హనుమంతరావు, శింగరకొండ కో ఆప్షన్ మెంబర్ కరిముల్లా, చిన ఆంజనేయులు, సొసైటీ చైర్మన్లు, సర్పంచిలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచిలు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ బాధ్యులు పాల్గొన్నారు.

అంధ విశ్వాసాలను పెంచిపోషిస్తున్న మోదీ ప్రభుత్వం

- మార్క్సిస్ట్, పత్రికా సంపాదకుడు డీవీవీఎస్ వర్మ



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: దేశంలోని ప్రజల్లో అంధ విశ్వాసాలను పెంచి పోషిస్తున్న మోదీ ప్రభుత్వం వలన దేశం శరవేగంగా వెనక్కి పరిగెడుతోందని మార్క్సిస్ట్, పత్రికా సంపాదకుడు డీవీవీఎస్ వర్మ అన్నారు. చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతిని పురస్కరించుకుని వర్తమాన భారతదేశం, వామపక్షాల ఐక్యత, ఆవశ్యకత అనే అంశంపై ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఆదివారం నిర్వహించిన చర్చా వేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వామపక్షాలు లేకుండా దేశం ముందుకు సాగడం అసాధ్యమని తేల్చి చెప్పారు. విదేశాలలో ఉన్న నల్లడబ్బు తీసుకొచ్చి దేశ ప్రజల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.15 లక్షలు జమ చేస్తానని చెప్పి ఎన్నికల్లో గెలిచిన మోదీ.. గత 9 ఏళ్లలో కార్పొరేట్లకు 30 లక్షల కోట్ల రుపాయలను రాయితీలుగా ఇచ్చారన్నారు. దేశ ప్రజలకు బీజేపీ చేసిన మేలేమీ లేకపోగా, మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రాజేస్తోందని మండిపడ్డారు. పెద్దనోట్ల రద్దు సందర్భంగా 200 మంది సామాన్యులు మరణించారని, జీఎస్టీ పేరుతో నిరుపేదల నుంచి ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్నారని అన్నారు. ముందుచూపులేని మోదీ పాలనలో దేశాభివృద్ధి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని చెప్పారు. మోదీ పాలనకు చరమగీతం పాడేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో వందేభారత్ రైలును ప్రారంభించిన సమయంలో భాగ్యలక్ష్మీనగర్ నుంచి వెంకన్న నగర్ వరకు అంటూ మాట్లాడటం ద్వారా ప్రధాని పదవి స్థాయిని దిగజార్చి మతోన్మాదాన్ని రెచ్చగొట్టేలా మోదీ మాట్లాడటం దారుణమని సీనియర్ జర్నలిస్టు మెలకపల్లి కోటేశ్వరరావు అన్నారు. హుసేన్ సాగర్‌ను వినాయకసాగర్ అంటూ కొత్త పేర్లు పెట్టి పిలవడం ద్వారా తెలంగాణలో మతకలహాలు సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రజలు చైతన్యవంతులై మతోన్మాదాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ముందుగా చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నల్లూరి వెంకటేశ్వర్లు, వై.సిద్దయ్య, ఎం.సి.వెంకటేశ్వర్లు, ఎం.వెంకయ్య, ఆర్.వెంకటరావు, కే వీరారెడ్డి, ప్రొఫెసర్ మనోరమ, ఎస్డీ సర్దార్, పీవీఆర్ చౌదరి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విష గుళికలు తిని రెండు పాడిగేదెలు మృతి

గిద్దలూరు రూరల్: విష గుళికలు తిని రెండు పాడిగేదెలు మృతిచెందిన సంఘటన మండలంలోని పాదలకుంటపల్లె గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శనగ పోల్‌రాజు పాడి గేదెలు మేత మేసేందుకు పొలం వెళ్లాయి. పొలాల వద్ద పందులు, పాముల నివారణ కోసం రైతులు ఉంచిన విష గుళికలు తిని మృతి చెందాయి. దీంతో సుమారు రూ.80 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

భారీగా అక్రమ మద్యం పట్టివేత

- 648 ఫుల్ బాటిళ్లు, కారు, బైక్ స్వాధీనం
- రెండు కిలోల గంజాయి పట్టివేత
- అట్టపెట్టెలు మార్చి మద్యం సరఫరా
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ ఆవులయ్య



నిందితుల సమక్షంలో వివరాలు వెల్లడిస్తున్న ఆవులయ్య, స్వాధీనం చేసుకున్న కారు, బైక్

దర్శి: హర్యానా, గోవా రాష్ట్రాల నుంచి అక్రమంగా భారీగా తీసుకువచ్చిన మద్యాన్ని దర్శి ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తీగ లాగితే డొంకంతా కదిలినట్లు పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో కూడా దాడులు చేసి మొత్తం రెండు కిలోలు గంజాయి, 648 మద్యం ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎక్సైజ్ సబ్ స్టేషన్‌లో సీఐ సుందరరామయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 8న తాళ్లూరు మండలం గుంటిగంగమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా మద్యం విక్రయిస్తున్న రామభద్రాపురం గ్రామానికి చెందిన పులి కృష్ణారెడ్డి, గంగిరెడ్డి సుబ్బారెడ్డి, తూర్పు గంగవరానికి చెందిన గుజ్జుల బాలకృష్ణారెడ్డిలను దర్శి సిబ్బంది చాకచక్యంగా పట్టుకొని వారి వద్ద 60 మద్యం ఫుల్ బాటిళ్లు, వాటిని పంపిణీ చేసేందుకు ఉపయోగిస్తున్న ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు ఏఈఎస్ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు నెల్లూరులో ధనలక్ష్మీపురానికి చెందిన ఎస్‌వీ రాఘవేంద్ర శ్రావణ్‌కుమార్ నిల్వచేసిన 588 మద్యం బాటిళ్లు, రెండు కిలోల గంజాయి, సరుకు రవాణాకు ఉపయోగిస్తున్న కారును సీజ్ చేశారు. ఈ మద్యం బాటిళ్లు హర్యానా, గోవాల నుంచి పన్నులు లేకుండా తీసుకొని నూనె అట్టపెట్టెల్లో పెట్టి సీల్ చేసి లారీల్లో సరఫరా చేస్తున్నారు. వీటి విలువ మన రాష్ట్రంలో రూ.5.23 లక్షలకు పైగా ఉంటుందని, అక్కడ రూ.1.75 లక్షలకే లభిస్తుందని తెలిపారు. రాఘవేంద్ర శ్రావణ్‌కుమార్ పొట్టిశ్రీరాములు నెల్లూరులో నిల్వ ఉంచి కారులో ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఎవరైనా మత్తు పదార్థాల అక్రమ వ్యాపారంపై సమాచారం ఇస్తే వెంటనే దాడులు చేస్తామని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దాడుల్లో చీమకుర్తి ఎస్సై ఎం నగేష్, దర్శి సెబ్ కానిస్టేబుళ్లు షేక్ హబీబ్ బాషా, ఎస్‌కే బాషా, దస్తగిరి, సుబ్బారావు, డీటీఎస్ కానిస్టేబుల్ ఎస్ శ్రీనివాస్, కేవీ రామిరెడ్డిలను అభినందించారు. దాడుల్లో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ బి.సుందర రామయ్యకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వీఆర్వోల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం



ఒంగోలు డివిజన్ నూతన కమిటీతో జిల్లా కమిటీ సభ్యులు

- అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాము

ఒంగోలు అర్బన్: వీఆర్వోల సమస్యల పరిష్కారం కోసం అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని వీఆర్వోల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.రాము అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన వీఆర్వోల అసోసియేషన్ ఒంగోలు డివిజన్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వీఆర్వోలకు పెరిగిన పనిభారం, ఇతర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి ప్రణాళికాబద్ధంగా తీసుకెళ్తూ పరిష్కారం కోసం ప్రయత్నిస్తామన్నారు. రాష్ట్ర కమిటీ నిర్ణయాల మేరకు జిల్లా కమిటీలు, డివిజన్ కమిటీలు కలిసికట్టుగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘ మార్కాపురం డివిజన్ అధ్యక్షుడు ఎస్.సుబ్బరామిరెడ్డి, కనిగిరి డివిజన్ అధ్యక్షుడు కె పద్మనాభం, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఒంగోలు డివిజన్ నూతన కమిటీ...

వీఆర్వోల సంఘ ఒంగోలు డివిజన్ నూతన కమిటీ అధ్యక్షునిగా పి.చంద్రశేఖరరావు, ఉపాధ్యక్షులుగా నున్నా సురేష్, పి.వెంకటస్వామి, జి.వినీల, సెక్రటరీగా జి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా బి.శ్రీనివాసరావు, టి.జాన్‌లిపి, పి.వెంకట శేషారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎస్‌సీ సాయిరాం, దారా వెంకట్రావు, కె.పోతురాజు, కోశాధికారిగా కె.జగదీష్‌బాబు ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

- ముగ్గురికి గాయాలు

సింగరాయకొండ: సైకిలిస్టును తప్పించబోయి మోటార్ సైకిల్ రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయిన ప్రమాదంలో చిన్నారి మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం రాత్రి పాపనకోనేరు సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బేల్దారి పని నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్న పాకలకు చెందిన పులగర సలోమి తన కుమార్తె మానసిక దివ్యాంగురాలైన ప్రతిభాపాటిల్(7)తో కలిసి ఫించన్ కోసం పాకల గ్రామానికి వచ్చింది. శనివారం 7 గంటల సమయంలో తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు తన బంధువు రేణుమాల కార్తీక్ మోటారుసైకిల్ పై ట్రావెల్ బస్సు ఎక్కేందుకు బయలుదేరింది. మోటారుసైకిల్‌ను కార్తీక్ నడుపుతుండగా సలోమి, ప్రతిభాపాటిల్, రేణుమాల రాకేష్ కూడా ఉన్నారు. మోటారుసైకిల్ పాకల ఊరు చివర ఉన్న పాపనకోనేరు సమీపంలోకి రాగానే సైకిలిస్టు మోటారుసైకిల్‌కు ఎదురుగా రావటంతో అతని తప్పించే ప్రయత్నంలో మోటారుసైకిల్ రోడ్డు మార్జిన్‌లో పడిపోయింది. ఈ క్రమంలో సలోమి, ప్రతిభాపాటిల్‌లు మార్జిన్‌లోని చిల్లచెట్లలో ఇరుక్కుపోయారు. వీరిద్దరికి తీవ్రగాయాలు కాగా, రాకేష్, కార్తీక్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. గాయలైన నలుగురిని 108లో ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా ఒంగోలు జీజీహెచ్‌కు పంపించారు. చిన్నారి ప్రతిభాపాటిల్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రతిభాపాటిల్ ఆదివారం మృతి చెందగా, సలోమి తలకు తీవ్ర గాయాలవటంతో ఆమె తలకు ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం సలోమి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు.



కారంచేడులో చిన్ననాటి స్నేహితుల ఆత్మీయ కలయిక

50 ఏళ్ల జ్ఞాపకాలతో.. ఆత్మీయ సమ్మేళనం

- హాజరైన మాజీ హైకోర్టు న్యాయమూర్తి సునీల్ చౌదరి

కారంచేడు: 50 ఏళ్ల తమ పూర్వ జ్ఞాపకాలను నెమరేసుకోవడానికి అక్కడకు చేరిన వారికి సమయం సరిపోలేదు. ఈకార్యక్రమానికి ఆదివారం కారంచేడులోని డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు కల్యాణ మండపం దీనికి వేదికయ్యింది. గ్రామంలోని యార్లగడ్డ నాయుడమ్మ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో 1973–74లో 10వ తరగతి చదివిన విద్యార్థులు అదే గ్రామంలోని ఒక కల్యాణ మండపంలో కలుసుకున్నారు. ఎంతో బిజీగా ఉండే వీరంతా కారంచేడులో కలుసుకొని తమ చిన్ననాటి మధురమైన అనేక విషయాలను చర్చించుకున్నారు. మొదట తమ గురువులుగా ఉన్న కొద్దిమందిని ఘనంగా సత్కరించుకున్నారు. ఆదే బ్యాచ్‌కి చెందిన తాళ్లూరి సునీల్‌చౌదరి హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం ఆయన రాష్ట్ర వినియోగదారుల హక్కుల సంఘం చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరికీ జ్ఞాపికలను పూర్వ విద్యార్థి పద్మావతి బహూకరించారు. వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మాజీ ఎంపీపీ ఎం అక్కయ్యచౌదరి, దగ్గుబాటి లక్ష్మీనారాయణ, గంటా ఉదయ్, పాటిబండ్ల హేమలత, మండవ సుబ్బయ్య, డీ రాజాబాబు, రాధ, పద్మ, లత పాల్గొన్నారు.